# అప్పు

కుసుమ



ప్రతి మనిషి జీవితములో ఎప్పుడో ఒకప్పుడు ఒకరి వద్దనుండి అప్పు తీసుకొనటమో, మరొకరికి యివ్వటమో సహజంగా జరుగుతుంటుంది. చాల భయంకరమైన పరిస్థితి ఏర్పడితేనే తప్ప మనిషి అప్పు అడగడు. అంతమాత్రానికే జాలిపడి ఎదుటి మనిషి అప్పిస్తాడన్న నమ్మకమూ లేదు. ఉన్న ఆస్తి కుదువకట్టుగా రాసి యిస్తేనో లేక ఏదైనా సొమ్ము తాకట్టు పెడితేనేగానీ అప్పు పుట్టదు.

అవేవీ లేని గోపాలం తిరిగి తిరిగి విసుగుపడి పోయాడు. అతనికి ఎక్కడా అప్పు పుట్టలేదు దిగాలుపడి ఇల్లు చేరాడు.

"తెచ్చావా డబ్బు" తల్లి ఎదురుగా వచ్చి ప్రశ్నించింది

"లేదు."

"అదే! ఏమన్నారూ?" కుక్కి మంచంలో పడి మూల్గుతున్న తండ్రి ప్రశ్నించాడు.

అంతవరకు విసుగుపడి దిగాలుగా ఇల్లు చేరిన గోపాలానికి తల్లీ, తండ్రీ మాటలు వినగానే ఎక్కడలేని కోపం వచ్చింది.

"మీరు సంపాదించిన ఆస్తిపాస్తు లేమున్నాయి? తేరగా ఒకరు పిలిచి అప్పు పెట్టటానికి" అంటూ గంతులు వేశాడు.

"అంత మాత్రానికే కంగారు పడితే ఎలారా గోపాలం? రెక్కాడితేనే డొక్కాడే పరిస్థితుల్లో నాలుగు రాళ్ళు మిగుల్చుకునే సమయం ఎప్పుడేర్పడిందిచెప్పు? పిల్లా-జెల్లా యీడ్చుకుంటూ నీ చదువు చెప్పించటానికే సరిపోయే యింకా పొదుపు చేసే దెప్పుడు? నాలుగు రోజులు మంచాన పడ్డాను. అంత మాత్రానికే సంసారాన్ని ఈడ్చలేక నిప్పు తొక్కిన కోతిలా గంతులేస్తా వెందుకు?" కాస్త మందలింపుగా అన్నాడు తండ్రి.

"ఏంచేయమంటావు నాన్నగారూ! తిరిగి తిరిగి విసుగెత్తిపోయాను. ఒక్కరూ అప్పిచ్చిచావలేదు. 'ఆస్తిపాస్తులు కుదువ కట్టుగా రాసియిస్తేనే ఈ రోజుల్లో అప్పుపుట్టటం లేదు.' అని ఒక రంటే. రామ రామ! మనిషినినమ్మి ఈ రోజుల్లో అప్పు పెట్టటమా? ఏదైనా సొమ్ము తాకట్టు ఉంచేనే తిరిగి మన అప్పు మనకు వసూలయ్యేది.' అంటూ మరొకరు. యింక చేసేది ఏముంది చెప్పు?" నిరుత్సాహ పడిపోయి అన్నాడు గోపాలం.

లోక వ్యవహారం తెలియని కొడుకుని చూచి గోపాలం తండ్రికి జాలి కలిగింది. ఔను, వాడికేం తెలుసు? మొన్నటి వరకూ చదువుకున్నాడు. తెల్లని వన్నీ పాలనీ, నల్లనివన్నీ నీళ్ళని నేర్చుకున్నాడు.

"చూడు గోపాలం నువ్వన్నట్టు దేశం మొత్తం మీద అందరికీ ఆస్తి. పాస్తుల్లేవు. అయినప్పటికీ వాళ్ళందరూ బ్రతుకుతూనే వున్నారు. ఏదోవిధంగా అప్పు పుట్టించుకుంటున్నారు. ఈ విధంగా ప్రవర్తిస్తే అప్పుపుడుతుందన్న నమ్మకంలేదు. ఏదో ఒకవిధంగా అప్పు పుట్టించుకోవాలి. కమ్మని మాటలు చెప్పటమేకాదు. కథల్లాలి. నీఅంతటి ధార్మికుడూ. గుణవంతుడూ లేడని పొగడాలి. అంతగా అవసరం అనిపిస్తే బొటబొట కన్నీరు కార్చాలి. ఒక్క మాటలో చెప్పాలంటే. అప్పిచ్చే వాడిముందు చచ్చి మళ్ళీపుట్టాలి. అంటూ గోపాలాన్ని ఓదారుస్తున్నట్లుగా, లోక వ్యవహారాన్ని

గురించి చిన్న ఉపన్యాసం యిచ్చాడు తండ్రి.

గోపాలం అర్థంచేసుకున్న వాడిలా తలఊపి "అయితే మళ్ళీ వెళ్ళి ప్రయత్నిస్తాను" అని బయటికి నడిచాడు."

గోపాలం వెళ్ళేసరికి రామయ్య తీరుబడిగా ఇంటిముందు వసారలో కూర్చుని చుట్టకాల్చుకుంటున్నాడు.

"మీరుతప్ప వేరే గత్యంతరంలేదు. ఊరు మొత్తం గాలించాను. ఎక్కడా అప్పుపుట్టలేదు. ఒక్క పాతికరూపాయిలు యిప్పించండి. నాన్నగారికి జ్వరం ప్రేలేసి పోతుంది. మీ ఋణం వుంచుకోను" బ్రతిమిలాడుతూ అన్నాడు గోపాలం.

రామయ్య పీలుస్తున్న చుట్టని నోట్లోంచి తీసి తుపుక్కున ఉమ్మివేశాడు.

'ఇంతకు పూర్వమే చెప్పానుగదయ్యా! డబ్బు నా దగ్గర దొరకదనీ"

"పెద్దలు మీరే అలా అంటే ఎలా చెప్పండి" నీళ్ళు నములుతూ చేతులు నలిపాడు గోపాలం.

'సాగదీసి మాట్లాడే వ్యవహారం మన దగ్గర లేదు. ఒకసారి మాట అన్నాను అంతే. వెళ్లిరా!"

"అదికాదండీ ..." గోపాలం మాటల్ని మధ్యలోనే తుంచి వేశాడు రామయ్య.

"లాభంలేదు. నా వద్ద డబ్బు దొరకదు' ఖచ్చితంగా అనేసి లోపలికి వెళ్ళిపోయాడు రామయ్య.

గోపాలం ఒక నిట్టూర్పు విడిచి వెనుతిరిగాడు.

పాలేర్లకి పనులు పురమాయిస్తున్న రమణయ్య, గోపాలం లోనికి రావటం చూచి — "ఏమోయ్! మళ్ళీ వచ్చావు ఏమిటీ విశేషం" అంటూ ప్రశ్నించాడు.

'ఇంకేముందండీ! ఊరు మొత్తం గాలించాను. ఎక్కడా అప్పుపుట్టలేదు. ఇంటికి వెళ్లాను. చిన్న పిల్లలు 'అన్నం...అన్నం..." అంటూ అమ్మ చుట్టూ గోలపెడ్తున్నారు. నాన్నగారికేమో జ్వరం కాలిపోతుంది. పాతాని అయ్యంగారి డాక్టర్ పైసలివ్వందే నాడి చేత పట్టనన్నాడు. ఏం చేయటానికి తోచలేదు. పదే పదే మనస్సులో మీరే కదులాడారు. అంతే పరుగెత్తుకొచ్చాను" కళ్ళల్లో నీళ్లు తెచ్చుకుని అన్నాడు గోపాలం.

"నిజమేనోయ్! నీ పరిస్థితి చూస్తుంటే జాలి కలుగుతుంది. కాని ఏం చేయమంటావు చెప్పు? సమయానికి చేతిలో ఒక్క చిల్లిగవ్వ వుండి చావలేదు. పాపం! ఎంతో ఆశతో పరుగెత్తుకొచ్చావు. ప్చ్..." అంటూ నిస్సాయకంగా నిట్టూర్చాడు రమణయ్య.

నీరు కారిపోయి వెనుతిరిగాడు గోపాలం.

డబ్బు లెక్కపెట్టుకుంటున్న లాల్‌శేటు గోపాలం రావటముచూచి తెరచివున్న గల్లాపెట్టెని మూశాడు. గోపాలం లాల్‌శేటు దగ్గరా వచ్చి కూర్చున్నాడు.

"మళ్ళీ త్వరగానే వచ్చావు ఏమిటి సంగతి? హ్హి.. హ్హి" అంటూ నవ్వాడు లాల్‌శేటు.

"ఏముంది శేటు. ప్రాణాలు పోతున్నాయని అరుస్తూ తిరిగి నప్పటికీ ఒక్కరూ అప్పిచ్చిన పాపానపోలేదు. నువ్వయినా దయతలచి ఒక్క పాతిక రూపాయిలు అప్పివ్వి పుణ్యం కట్టుకో శేటు. నా ప్రాణాల్ని ఒలిపెట్టి అయినా నీ ఋణం తీర్చుకుంటాను శేటు" అని, అంటుంటే గోపాలం కళ్ళనుంచి బొటబొట నీరు కారింది.

"అయ్యో! అయ్యో!! ఎంత కష్టం ...ఎంత కష్టం" బాధపడుతూ అన్నాడు శేటు.

"ఇక అడగవలసినవారు ఎవరూలేరు శేటు, నీవు తప్ప".

"ఎంతమాట ... ఎంతమాట" ముక్కుమీద వ్రేలు వేసుకున్నాడు లాల్‌శేటు.

"ఒక్క పాతికరూపాయలు..."

"ఎంత మాట. ఎంత మాట. నీ దగ్గర ఒక్క పాతిక రూపాయలు..."ఆశ్చర్యాన్ని ప్రకటించాడు శేటు.

"వడ్డీ ఒక్క పైస ఎక్కువగానే చెల్లించుకుంటాను."

"నీ దగ్గర వడ్డీయా!"

గోపాలం ఒక్క క్షణం ఆశపడిపోయాడు.

"...అంటే, హ్హి ... హ్హి ... పరిస్థితి అంతా చూస్తూ...ఒక్క పాతికరూపాయలు ఏం కర్మ... మరో... హ్హి ... హ్హి ..."

"శేటు" తొట్రుపాటుగా పిలిచాడు గోపాలం.

"ఎందుకు అబద్ధ మాడిస్తావ్! అమ్మ ఒట్టు ఒక్కపైస లేదు. నమ్ము...హ్హి.. హ్హి..."అంటూ చేతులు రెండు నెత్తిమీద పెట్టుకున్నాడు శేటు.

> ఒక వ్యక్తి మరొకరి మనస్సులోని
> విషయాన్ని తెలుసుకున్నాడంటే
> ప్రేమవల్ల సానుభూతిసామ్యంవల్లనే కాని
> వయస్సువల్ల, బుద్ధివల్ల మాత్రంకాదు.
>
> —శరత్ చంద్రుడు

నీరసంగా లేచి వెనుదిరిగాడు గోపాలం

అప్పు అడగడం ఎంత సిగ్గుచేటు. ఎంత చులకనచేసి మాట్లాడుతారు. తమ ఆధిక్యతని ప్రదర్శించుకుంటారు. ఎంత నిర్లక్ష్యంగా జవాబిస్తారని! అప్పు యివ్వటం తప్పించుకొనుట కొరకు ఎంత దిగజారి మాట్లాడుతారు. ఓర్పుగా అప్పుఅడిగే వానిని నేర్పుగాతప్పించుకుంటారు. అప్పిచ్చేవాడు యివ్వలేనని ఎంతగా బాధనటిస్తారు. అప్పు అందుకునేందుకు అప్పు అడిగేవారు అల్లుకుని చెప్పే కథలకంటే, అప్పివ్వలేనని తప్పించుకొనటానికి అప్పిచ్చేవాడు చెప్పేకథలు గోపాలానికి వికారాన్ని పుట్టించాయి. ఉండుకుని కూడా 'ఒట్టు, సత్యం' అంటూ వాళ్ళు ఆత్మవంచన చేసుకుని మాట్లాడటం గోపాలానికి నీచమనిపించింది, అయినప్పటికీ అందరినీ అడిగాడు గోపాలం. ఎవ్వరూ అప్పివ్వలేదు.

నీరు నిండిన కళ్ళతో ఇల్లు చేరిన గోపాలాన్ని చూచి తల్లి కంగారు పడిపోయింది. కొడుకుని పలుకరించటానికి ఆమెకు నోరు పెగల్లేదు. నాకు అప్పు పుట్టలేదని చెప్పటానికి గోపాలానికి మనస్కరించలేదు. "నాన్నగారికి ఎలా వుంది' ప్రస్తావాన్ని మార్చి అడిగాడు గోపాలం.

"తగ్గుముఖం లేదు. యింకా జ్వరం ఎక్కువగానే వుంది.' అంటూ బావురుమని ఏడుస్తూ ముఖానికి చేతులు కప్పుకుని కూర్చుండిపోయింది.

గోపాలం కంగారుగా తండ్రి మంచం వద్దకు పరుగెత్తాడు.

"నాన్నగారూ...నాన్నగారూ .."

నాలుగైదు పిలుపులకి గోపాలం తండ్రి మెల్లగా కళ్ళు తెరచి గోపాలం ముఖంకేసి చూచాడు

"ఎలా వుంది?" శోకం గొంతులో ఎక్కు తిరుగుతుండగా అడిగాడు గోపాలం.

"అది సరే. నీకు అప్పు..."

'లేదన్నటుగా' తల ఊపాడు గోపాలం.

"ఇలారా!"

గోపాలం కాస్త ముందుకి వంగాడు.

"...అంతే!" గోపాలం తండ్రి ఇక మాట్లాడలేకపోయాడు.

"నాన్నగారూ" బిగ్గరగా ఏడుస్తూ కుప్పలా కూలబడి తల బాదుకొనసాగాడు గోపాలం. తల్లి సంగతి గ్రహించి - "అయ్యో! దేముడా!" అంటూ గుండెలు పగిలేలా గుద్దుకుంటూ క్రిందపడి దొర్లసాగింది. విషయమేమిటో తెలియని చిన్నపిల్లలు దగ్గరాచేరి తల్లికి సహాయంగా గొంతెత్తారు.

క్షణములో చిన్నలూ- పెద్దలూ వచ్చి గోపాలం ఇంటిచుట్టూ మూగారు. మంచములోనుంచి తీసి గోపాలం తండ్రిని క్రింద పెట్టారు కొందరు. తెల్లటి గుడ్డ ఒకటి అతనిమీద నిండుగా కప్పారు.

"అయ్యో పాపం!... అంతా చిన్నపిల్లలే!" అని కొందరు—

"ఎంత మంచివాడని! అప్పో సప్పో చేస్తూ సంసారాన్ని ఎంతగుట్టుగా వెళ్ళదీస్తూ వచ్చాడని"- అని మరి కొందరు-

"చూస్తుండగానే పోయాడు. అదృష్టవంతుడు" అని. మిగిలినవారు ఎవరికితోచిన విధంగా వారు వాపోయారు.

పొద్దు ఏట వాలింది.

శవాన్ని యింకా శ్మశానం చేర్చకపోవటం కొందరిని బాధించింది. అప్పుడే శవం వాసన పట్టిందని కొందరు ముక్కులుకూడా మూసుకున్నారు.

రామయ్యకి జాలి వేసింది, గోపాలం తండ్రి తనకు చేసినలాభం గుర్తుకి వచ్చింది. అప్పుడెప్పుడు తీసుకున్న అప్పు తీర్చలేక అతనికున్న రెండు ఎకరాల మెట్టని అతిచౌకగా తనకి విక్రయించాడు. అటువంటిది ఈనాడు అతని శవదహనానికి ఒక్క పాతిక రూపాయలు అదీ...అప్పుగా గోపాలానికి యిస్తే ... ఏం పోయింది?

గోపాలాన్ని చాటుకి తీసుకెళ్లాడు రామయ్య.

"చూడు గోపాలం! శవం యింకా శ్మశానం చేరకపోవటాన్ని గురించి అందరూ కొప్పడుతున్నారు. నీ దగ్గర డబ్బు లేదంటూ ఉదయమే నా వద్దకు వచ్చావు కదూ! ఇదిగో ఈ పాతిక రూపాయలు తీసుకుని తగిన ఏర్పాట్లు త్వరత్వరగా కానిచ్చేయ్" జేబులోంచి డబ్బు తీశాడు రామయ్య.

"వద్దండీ'

"ఊరక కాదులేవయ్యా! అప్పుగానే యిస్తున్నాను. తీసుకో" అంటూ బలవంతంగా గోపాలం

చేతిలో పెట్టాడు రామయ్య.

రమణయ్య యిక ఆలోచించలేక పోయాడు. చాలాసార్లు అవసరంగా గోపాలం తండ్రి తనదగ్గర ఎక్కువ వడ్డీకి తీసుకుని ఏ పేచీ పెట్టకుండా అనుకున్న రోజున తెచ్చియిచ్చేవాడు. అటువంటిది ఈనాడు అతని అంత్యక్రియలకి ఒక్క పాతికరూపాయలు అదీ...గోపాలానికి...వడ్డీకి యిస్తే...ఏం పోయింది? మనిషి బ్రతికున్నంత వరకూ మన వైరం ఎక్కడికి పోదు.

గోపాలం దగ్గరికి వెళ్లాడు రమణయ్య.

లాల్ సేటు అటు ఇటు విచారించేయసాగాడు. అతని మనస్సంతా గోపాలం తండ్రి మీద పీక సాగింది. ఎప్పుడూ గోపాలం తండ్రి ఖాతాలో తప్పుడు లెక్కలు చేర్చేవాడు. అసలు లాభం పోనూ వడ్డీ కట్టుకుని యివ్వని సరుకు పైసలు కూడా మధ్యలో చేర్చి రాబట్టుకునేవాడు. రామయ్య తనమీదికి ఎన్నిసార్లు పురికొల్పినప్పటికీ గోపాలం తండ్రి ముందుకు రాలేదు. ఏనాడూ పెదవి విప్పి అన్యాయం అని అనవలేదు. అంత మంచివాడు. అటువంటిది ఈనాడు అతని శరీర దహనానికి ఒక్క పాతిక రూపాయలు అదీ ..

లాల్ సేటు ఆప్యాయముగా గోపాలాన్ని దగ్గరికి పిలిచాడు.

ముగ్గురి వద్దనుండి మూడు పాతికలు అందుకున్న గోపాలం విరగబడి నవ్వాడు.

'చస్తున్నాంరా భగవంతుడా అంటే ఒక్కరూ ఒక్క పైసా నమ్మి అప్పిచ్చిన పాపాన పోలేదు ఈనాడు చచ్చిపోయిన తరువాత అంత్యక్రియకి జాలిపడి అందరూ పిలిచి అప్పిచ్చారు. బ్రతికుండగా సహాయ పడటానికి ఇచ్చగించని మనిషి ఆవలివాడు చచ్చిన తరువాత జాలి పడుతాడు అందుకని ఇతరుల సహాయం. సానుభూతి పొందటం కోసం మనిషెప్పుడూ చచ్చి పుడుతుండాలి. అంతే కదా? అలా అయితేనే అప్పి స్తారు. ఆదుకుంటాడు. అందుకని మనిషి చచ్చి నట్టుగా నటించాలి. నటించాలి. ఏడవాలి' ఆవేశ పూరితంగా గోపాలం అరిచి చకచక నడిచి వెళ్ళి తండ్రి మీద కప్పిన గుడ్డని లాగివేశాడు గోపాలం.

గోపాలం తండ్రి నిబ్బరంగాలేచి కూర్చున్నాడు.

"నేనింకా అదీ చచ్చిపోయిన నాకు అప్పు సంపాదించటానికి ఈమాత్రం నటన ఎందుకు చేయకూడదు? అని నాన్నగారు చెప్పి చేయించాడు. 'చస్తున్నాం ... చస్తున్నాం వస్తలతో, నుస్తులతో చస్తున్నాం.' అని అరుస్తూ పరిగెత్తే కంటే. చచ్చినట్టుగా నటించి అప్పు సాధించటంలో తప్పులేదనిపించింది" అంటూ గోపాలం చెప్పుకుపోతుంటే. అందరూ ఆశ్చర్యపోయి చూస్తుండి పోయారు.

★

# ఇక్బాల్

ఉర్దూ : మఖ్దూం మొహియుద్దీన్

తెలుగు : గజ్జల మల్లారెడ్డి

ఏ అగ్ని నిశ్వాసు
డీ అంధకారాన
ఆలపిస్తున్నాడు
బ్రతుకు మలుపులకొత్త
పాటలను పాడుతూ
అంధతమమున వెలిగె
ఆ అగ్ని సంభాషి
ప్రతిచోట ప్రతివీట
ప్రతినోట నినదించె
ఆ మార్గదర్శకుని
అమరకవితావాణి
అవి మనుజమాత్రులకు
అంతబట్టని నవ్య




అంగార గీతాలు!
అరుణోదయ ప్రభల
విరజిమ్ముతున్నాడు!
మృత్యు భీకరవికట
స్వప్న వేశమించె
కమ్ముకొన్న తెరలు
మటుమాయమై పోయె
ఒక జ్వాల పైకెగసి
ఉప్పెనముసంటింది
స్వర్లోక యువజనుల
సరసిలకు చేరింది
అపరిహార్యమైన చర్య
దివిని వెలవేగింది
కవితా విహావేశ
కమనీయ గీతాలు
లోక మెరుగని మరో
లోకాలలో నుంచి
దేవదూతలు పాడు
దివ్యశంఖ ధ్వనులు
చిదగన వనవాటి
చిపురించు దీపాలు
అవి రాగమా? కాదు
ఆపాదమస్తకము
ఆవహించిన వలపు
బంగారు వీణదే?

మూలం : 'ఇక్బాల్